# ఆశల మెట్లు

బొట్లు బొట్లుగా జారిపడుతున్న చెమటను తుడుచుకోవడానికి చెయ్యి ఖాళీగా లేదు పెంచలమ్మకు, నుదుటన పెట్టుకున్న రూపాయికాసంత కుంకుమ బొట్టు చెమటకు తడిసి ముక్కుమీదకు పాకింది. ఒంటి కతుక్కుపోయింది ఆమె తొడుక్కున్న రవికె. ఎండ దెబ్బకు కాచుకోవటానికో, దుమ్ము పడకుండానో మరి తలకు ఎఱ్ఱటి బట్టొకటి చుట్టి వెనకాల ముడి చుట్టింది.

చిన్ని చీపురొక చేత్తోనూ, ఇనుపరేకొక చేత్తోనూ పట్టుకుని రోడ్డు మీదున్న తుక్కు దూగరా శుభ్రంగా ఊడ్చి, ఎత్తిపోస్తోంది. రోడ్డుకు ఎడం పక్కగా ఆగివున్న రోడ్డురోలరు 'భయ్' న శబ్దం చేస్తూంది. తారు కరిగిస్తున్న శీనయ్య బొగ్గులూ, చితుకులూవేసి నిప్పులు కణకణ లాడేట్టు చేస్తున్నాడు.

రోడ్డు పక్కనే గుట్టగా పోసిన కంకర రాళ్ళను చిన్న చిన్న ముక్కలుగా కొట్టి పోస్తున్న పెంటమ్మ తల వెనక్కి తిప్పి నాలుగు గజాల దూరంలో చెట్టుకొమ్మకు కట్టివున్న గుడ్డ ఉయ్యాల కేసి చూపు సారించి, పెంచలమ్మ పిలిచింది. "బిడ్డ కదల్తా వుండాడు, ఎళ్ళి పాలిచ్చిరా, మేస్త్రీ వస్తే నే చెబ్తాలే."

చీపురూ, ఇనుపరేకూ రోడ్డు వారగా పెట్టి, ఉయ్యాలలోనుండి కొడుకును ఎత్తుకుని, చెట్టు నీడన చతికిలబడింది పెంచలమ్మ. రొంటినున్న చిన్న గుడ్డ సంచీతీసి, ఎండిపోయిన రెండు తమల పాకులూ, పొగాకుపాయా, చూరొక్క పలుకూ తీసుకుని బుగ్గన బిగించింది.

అదే సమయానికి రయ్యిన వచ్చిందొక స్కూటరు దూరం నుండే హారను మ్రోగిస్తున్నా, లెక్చరరు క్లాసులోకొచ్చినా కదలకుండా కూర్చున్న 'కేరేజాట్' విద్యార్థుల్లా రోడ్డు మధ్యన పనిచేస్తున్న కూలీలు ఒక్క అంగుళం కూడా కదల్లేదు, పళ్ళుబిగించి, 'డర్టీరోగ్స్' అని తిట్టుకుంటూ, స్కూటరు స్లోచేసి వాళ్ళ మధ్య నుండి నడుపుకు వెళ్ళి స్పీడెక్కించాడు రథ.చోదకుడు.

రాళ్ళు కొడుతున్న పెంటమ్మ, పిల్లాడికి పాలిస్తున్న పెంచలమ్మ మంత్రముగ్ధుల్లా ఆ స్కూటరు మీదున్న దంపతులవైపు రెప్పవాల్చకుండా, ఊపిరి తీయడం మరిచిపోయి మరీ చూసారు.

వెడల్పాటి బెల్టు, కళ్ళకు చలువ అద్దాలు ధరించి అచ్చం సినిమా హీరోలా వున్నాడా స్కూటర్‌వాలా. నైలెక్స్ చీరె, జడ అల్లకుండా వదులుగా మడిచి కట్టిన జుత్తు, మొహాన మెరుస్తున్న ప్లాస్టిక్ బొట్టూ వగైరాలతో నాజూగ్గావున్న అతగాడి భార్య మా దారికడ్డంగా కూర్చోవటానికి మీరెంత వాళ్ళు?' అన్నట్టు వాళ్ళకేసి నిరసనగా ఒకసారి చూసి మొహం తిప్పుకుంది.

కుర్రాడు కాళ్ళూ చేతులూ కదిలిస్తూ తడుముకుంటూండడం గూడా గమనించనంత శ్రద్ధగా వాళ్ళవైపే చూస్తూ కూర్చుండిపోయిన పెంచలమ్మ స్కూటరు కనుమరుగు కాగానే పెంటమ్మవైపు చూసింది.

"రాళ్ళు కొట్టేదీ, రోడ్లేసేదీ మనవూ... సికార్లు కొట్టేది ఆళ్ళూ..." అక్కసుగా అంది పెంటమ్మ.

"దేనికైనా పున్నెం జేసుకోవాల మరి. మన జన్మలింతే." పిల్లాణ్ణి ఉయ్యాల్లోవేసి చీపురు తీసుకుంది పెంచలమ్మ. తనూ, మొగుడూ ఆలాటి బట్టలేసుకుని స్కూటరుమీద తిరుగుతున్న సుందర దృశ్యాన్ని వూహించుకుని వేడిగా నిట్టూర్చింది.

రేసు గుర్రంలా దూసుకుపోయి స్కూటరు మైలు దూరం వెళ్ళగానే మొండి గుర్రంలా కదలనంటూ హఠం వేసింది. కళ్ళద్దాలు తీసి పెళ్ళాం చేతికందించి, ఇంజను పరీక్ష చేయడంలో పడ్డాడు స్కూటరు యజమాని.

నైలెక్స్ చీరెలో ఆవిడకు ఒళ్ళంతా మంటలు పెడుతున్నట్టుగా వుంది. అదేపనిగా రుమాలుతో తుడవటం వలన పౌడరంతా చెరిగిపోయి, జిడ్డుగా తయారయింది ముఖం, చేతుల్లో వున్న రెండేళ్ళ పిల్లను మోయలేక క్రిందకు దింపి, రేగిపోయిన జుత్తును సర్దుకోసాగింది. ఒక నిముషం గడవకముందే ఏడుపు లంకించుకుందా పిల్ల. ఆ పాప కాలికి బూట్లు లేవన్న సంగతి గుర్తొచ్చి చరాలున పాపను ఎత్తుకుందా తల్లి.

ఎండ మీది కోపం, స్కూటరుమీది చికాకు, పాపకు బూట్లు లేవన్న ఆక్రోశం అన్నీ మొగుడి మీద గ్రుమ్మరించిందామె. "ఈ డొక్కు స్కూటరు అమ్మి పారేస్తేసరి. పీడా వదుల్తుంది. అయినా పిల్లకు బూట్లు కొనడానికి మీనం మేషం లెక్కబెట్టే మన మొహాలకు పిక్నిక్కులేమిటంట!!"

ప్రొద్దుటినుండి అనుభవించిన ఉత్సాహమూ ఆనందమూ నీరుకారిపోగా, నీరసంగా మొహం వ్రేలాడవేసుకుని, స్టార్టరును పదేపదే తొక్కసాగాడు ఆమె భర్త.

అంతలో గాలిలో తేలి వస్తూందా అన్నట్టు అతి మెత్తగా జారిపోతూ, వాళ్ల ప్రక్కనుండే దూసుకుని పోయిందొక అందమైన కారు. క్షణకాలం కిటికిలో నుండి మెరుపులా తళుక్కున మెరిసిందొక అందమైన అతివ ముఖం, మేకప్ చెదరని ముఖమూ, జరీ బుటాలున్న బిన్నీ జార్జెట్ చీరా, కారు వెళ్ళిపోయిన పది నిమిషాలు దాకా గాలిలో తేలి వస్తున్న లావెండరు పరిమళం, రోడ్డు ప్రక్కన ఎండలో, పిల్ల నెత్తుకుని స్టార్టుకాని స్కూటరునూ, చెమటలు కక్కుతున్న మొగుణ్ణి చికాకుగా చూస్తూ నిలబడిన ఇల్లాలి మనసును మరింత బాధించాయి.

"ఛీ ఛీ వెధవ బ్రతుకు, ఇద్దరం ప్రొద్దుటి నుండి సాయంత్రందాకా అరిచి చస్తే గొర్రెతోక బెత్తెడేనని అవసరాలకు చాలీచాలని జీతాలే గానీ ఒక్క సరదా తీరదు. ఎన్నాళ్ళబట్టి సరదా పడుతూందో అలాంటి మంచి జార్జెట్ చీరె కొనాలని? పిల్లలు ముగ్గురికీ చెరో రెండు జతలు లేవు మంచి బట్టలు, ఖరీదైన కోరికలు తమకెలా తీరుతాయి?" అనుకుందామె విరక్తిగా, 'పక్కింట్లో వదిలేసి వచ్చిన పిల్లలు ఏమి గోల పెడ్తున్నారో... పిల్లల్ని తీసుకుని సినిమాకు వెళ్ళాలన్నా రిక్షాలకూ, టికెట్లకూ బోలెడంత ఖర్చవుతుందని సినిమాలు కూడా మానుకుంటున్నారు. ఏదో జన్మానికో శివరాత్రన్నట్టు ఇవాళ బయలేదర గలిగారు పక్కనున్న మైపాడుకు. వెళ్తే అలా కారులో హాయిగా వెళ్ళాలికానీ ఇలా ఎండలో మాడుతూ ప్రయాణం చేయడం ఏం సరదా? తమ బ్రతుకులింతే..." వెచ్చగా నిట్టూర్చిందామె.

కారు వెళ్ళి టి.బి. ముందు ఆగింది, ఆలు మగలు దిగి, పిల్లలిద్దర్ని దింపుకుని, బాస్కెట్, బెడ్డింగు వగైరాలు ఒకటొకటిగా మోసుకుని లోపలికి చేర్చారు.

పిల్లలిద్దరూ సరదాగా, హడావుడిగా మాట్లాడుకుంటూ, వరండా చివరకు వచ్చి సముద్రం కనబడుతుందేమోనని తొంగి తొంగి చూస్తున్నారు. వాళ్ళ అమ్మ మాత్రం అలసటగా కూర్చుండిపోయి, స్వగతం పలుకుతున్నట్టుగా అంది. "డబ్బు వుంటే చాలా? నలుగురూ వంగి వంగి దండాలు పెట్టేటట్టు వుండాలి దర్జా అంటే. ఈ రోజుల్లో చేతిలో 'పవరున్న' వాడికే మర్యాద. మన పాప పుట్టిన రోజుకు కలెక్టరుగారి భార్య వచ్చిందా? ముందొక నౌఖరు దిగి కారు తలుపు తీయాలి.... వెనకాల మరొక నౌఖరు ప్రెజెంటేషను పేకెట్ మోసుకు రావాలి. మధ్యలో ఠీవిగా నడుస్తూ ఆవిడ లోపలకు వస్తుంటే అందరూ ఒదిగి, ఒదిగి దారి ఇచ్చిన వాళ్ళే... అదీ అదృష్టమంటే....

ఆవిడ భర్త పాపం ఆలోచనలో పడిపోయాడు 'బంగారు వ్యాపారం చేసి డబ్బయితే సంపాదించగలిగాడు గానీ ఆవిడ కోరుకుంటున్న 'పవరు' ఎక్కడ తేగలనా?' అని.

ఎండలు మండిపోతూనే వున్నాయి. రోడ్డు పక్కన కూలీలు రాళ్ళు కొడుతూనే వున్నారు. ఒక పూట తిండి మానేసి, రోజుకష్టం ఖర్చుచేసి తెరమీద హీరో హీరోయిన్‌ల విహారాలు రంగుల్లో చూసి ఆకలినీ, శ్రమనూ మర్చిపోయి, ఆ కాసేపూ రంగుల కలలో తామూ బ్రతికి, మర్నాడు పని చేయడానికి బలాన్ని పుంజుకుంటున్నారు.

సముద్రంలో అలలు ఇంకా ఇంకా ముందుకు చొచ్చుకు రావాలని ప్రయత్నిస్తూనే వున్నాయి. స్కూటర్లమీదా, కార్లలో, విమానాల్లో తిరిగే మనుషులు ఇంకా ఇంకా ఎదగాలని, ఆశలమెట్లు ఎక్కాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు.

"వనిత" మాస పత్రిక

తేది : 1-12-1978